రైలు ఢీకొని పాలిటెక్నికల్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - గరివిడి

పట్టణంలోని ఓ ప్రవేట్ కళాశాలలో పాలిటెక్నికల్ చదువుతున్న విద్యార్థి ఎ. హిమగిరి(20) రాత్రి సుమారు 10 గంటల సమయంలో స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. రైల్వే హెచ్‌సి మధుసూదన రావు అందించిన వివరాలు ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా సీతా నగరం మండలం, చల్లంనాయుడు వలస గ్రామానికి చెందిన హిమగిరి పట్టణంలో ఓ ప్రవేటు కళాశాలలో చదువుతున్నాడు. రాత్రి కిరాణా సామాన్లు కొనడానికి బయటకు వచ్చి రైల్వే ట్రాక్ దాటుతుండగా పలాస నుంచి విజయనగరం వైపు వెళుతున్న ట్రైన్ ఢీ కొట్టినట్లు లోకో పైలెట్ తెలిపారన్నారు. పలాస జిఆర్‌పి పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైసిపిలో భర్త...టిడిపిలోకి భార్య

- ఒకరు పదవి కోసం మరొకరు పంతం కోసం
- ఎమ్మెల్సీ రఘురాజు రాజకీయం
- టిడిపిలో చేరిన పలువురు ప్రజాప్రతినిధులు

లోకేష్ సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్న రఘురాజు సతీమణి సుధారాణి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను...! భర్త వైసిపిలో కొనసాగుతుండగా భార్య టిడిపిలోకి జంప్ అయ్యారు. ఒకరు ఉన్న పదవి కోసం పార్టీలో కొనసాగుతుండగా, మరొకరు పంతం నెగ్గించు కునేందుకు పార్టీ మారిపోయారు. దీంతో, ఎమ్మెల్సీ రఘురాజు రాజకీయ చదరంగం మరోసారి తేటతెల్లమైంది. ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అభ్యర్థిత్వాన్ని ఈసారి పక్కనబెట్టా లంటూ ఎమ్మెల్సీ రఘురాజు ఏకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే అల్టిమేటం జారీచేయడంతో వ్యవహారం ముదర పాకానపడింది. రఘురాజు అల్టిమేటంపై సిఎం సీరియస్ అయ్యారట. పోతే పోనీ అన్నట్టుగా వ్యవహరించడంతో కొద్దిరోజులపాటు తటపటాయించిన రఘురాజు సతీమణి, ఎస్.కోట వైఎస్ ఎంపిపి సుబ్బలక్ష్మి(సుధారాణి) సహా కొంతమందిని టిడిపిలోకి పంపేందుకు ప్రణాళిక రూపొందించారు. పథకం ప్రకారం మండలంలోని కొంతమంది ఎంపిటిసి సభ్యులు, సర్పంచులతో కలిసి సుబ్బలక్ష్మి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యన సోమవారం ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీని వీడితే ఉన్న ఎమ్మెల్సీ పదవికి ఎసరు వచ్చే అవకాశం ఉండడంతో కొంతకాలం కొనసాగే ఉద్దేశంతో ఉంటానంటూ అనుయాయులకు రఘురాజు నచ్చజెప్పినట్టుగా చర్చ నడుస్తోంది. ఈ తరహా రాజకీయం అటు వైసిపి తరపున పోటీచేయ బోయే కడుబండి శ్రీనివాసరావును ఓడించి పంతం నెగ్గించు కోవడానికి టిడిపిలోనూ, ఇటు పదవి కోసం వైసిపిలోనూ భార్యా భర్తలు చేరిపోయారని జనం చర్చించుకుంటున్నారు. రఘురాజు ఏ పార్టీలోకి వెళ్లినా ఇటువంటి పరిణామాలే చవి చూడాల్సి వస్తుందని పలువురు విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి రఘురాజుకు పార్టీ మారడం, నమ్మి సీట్లు, పదవులు ఇచ్చిన పార్టీని సైతం వదిలేయడం కొత్తేమీ కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇందుకు తగ్గట్టే ఆయన రాజకీయ ప్రస్థానం కూడా కనిపిస్తోంది. 2009లో ఎన్నికల్లో కాంగ్రెస్ ఎస్.కోట అసెంబ్లీ టిక్కెట్ కేటాయించినప్పటికీ, కొన్ని కారణాలవల్ల వెనక్కి తీసుకుంది. దీంతో, స్వతంత్రంగా పోటీకి దిగడంతో కాంగ్రెస్ ఓడిపోయింది. అనంతరం కాంగ్రెస్‌లో చేరి 2014లో టిక్కెట్ సాధించు కున్నప్పటికీ ఓటమి చెందారు. ఆ తరువాత కొంత కాలానికే బిజెపిలో చేరి కమలం కండువా కప్పుకున్నారు. 2019 ఎన్నికలకు ముందు తిరిగి వైసిపిలో చేరి టిక్కెట్ కోసం ప్రయత్నం చేశారు. తొలి నుంచీ పార్టీలోవుంటూ, 2014లో గజపతి నగరంలో ఓటమి చెంది, తిరిగి 2019లో టిక్కెట్ కోసం ఎదురు చూస్తున్న కడుబండి శ్రీనివాసరావు ను, మంత్రి బొత్స సత్య నారాయణ సోదరుడు అప్పలనర్సయ్య కోసం తప్పించారు. దీనికితోడు సామాజిక సమీకరణాల నేపథ్యంలో కడుబండికి ఎస్.కోటలో అవకాశం ఇచ్చారు. ఇదే నియోజక వర్గంలో ఉంటున్న రఘురాజును పార్టీకోసం పనిచేయాలని, అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కొంత కాలానికే ఆ పదవి రఘురాజును వరించింది. పదవి వచ్చాక తాను అనుకున్నదే జరగాలన్నట్టుగా వ్యవహరి ంచడంతో స్థానిక ఎమ్మెల్యే కండబండితో విభేదాలు ఏర్పడ్డాయి. జిల్లాలోని ఓ కీలకనేత రఘురాజుకు సహకరించడంతో వివాదం తారా స్థాయికి చేరింది. ఆ సారి ఎమ్మెల్యేకు సీటు రాదని, రానివ్వనని, ఇవ్వవద్దని అనే స్థాయి వరకు వెళ్లడంతో విభేదాలు తారా స్థాయికి చేరాయి. ఒకానొకదశలో భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ రఘురాజును సుతిమెత్తగా మందలించారు. ఆ తరువాత పరిస్థితి మారలేదు సరికదా ఎన్నికల్లో కడుబండిని మార్చకపోతే తానే మారిపోతానంటూ అధిష్టానాన్ని హెచ్చరించేవరకు వచ్చింది. దీంతో, వైసిపి అధిష్టానమే వదిలించు కోవాలనుకుందో ఏమో...ఇటీవలే టిడిపి నేతలతో మంతనాలు జరిపిన రఘురాజు తన భార్యను, ఇతర నాయకులను ఆపార్టీలోకి పంపారు. ఇప్పటికే ఎస్.కోట టిడిపిలో బహు నాయకత్వం సీటు కోసం ఫీట్లు చేస్తున్న నేపథ్యంలో రాఘురాజు రాకతో గందరగోళంగా మారుతుందని తెలుగుతమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

- తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్ష
- రాజన్నదొరను గెలిపించడమే నేరమా?
- మా ఓట్లతోగెలిచి మానోట్లోనే మట్టి కొడతారా?
- గిరిజనసంఘం, వ్యకాస నాయకుల మండిపాటు

రిలే నిరాహారదీక్ష చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-మెంటాడ

గిరిజనులు, దళితులు,పేదల సాగులో ఉన్న భూములకు ప్రభుత్వం పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, ఎపి వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యాన సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. పెత్తందారుల చేతిలో ఉన్న అసైన్డు,సీలింగ్, అటవీశాఖ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మన్యం పార్వతీపురం జిల్లా అధ్యక్షుడు సీదర అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, కౌలురైతు సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షులు రాకోటి రాములు మాట్లాడారు. మెంటాడ ఏజెన్సీలో ప్రభుత భూములను, గిరిజనుల సాగులో ఉన్న భూములను పెత్తందారులు ఆక్రమిస్తుంటే వారికి డిప్యూటీసిఎం రాజన్నదొర కొమ్ము కాస్తున్నారని అన్నారు. గిరిజనుడై ఉండి గిరిజనులనే వంచనకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించడమే గిరిజనులు చేసుకున్న పాపమా అని నిలదీశారు. నియోజకవర్గంలో 18 కొండలను గుల్ల చేసేందుకు రాజన్నదొర అనుమతిచ్చి బడాబాబుల సేవలో రాజన్నదొర తరిస్తున్నారని అన్నారు. ఈ ఐదేళ్లలో గిరిజనులకు ఒక్క మంచి పనైనా చేశారా అని ప్రశ్నించారు. ఏజెన్సీలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. కనీస సౌకర్యాలు లేని గిరిజన గ్రామాలు ఉన్నాయని, వారి హక్కులను పాలకులే కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. సమస్యల పరిష్కారానికి పోరాడిన సిపిఎం నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. నియోజకవర్గ పరిధిలో 3200మంది గిరిజనులకు పట్టాలు కోసం పోరాడితే ఇప్పటికి కేవలం 490 మందికి ఇచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. సమస్య గురించి అడిగితే ఎదురు దాడి చేయడం తగదని అన్నారు. కార్యక్రమంలో దీక్షలో గిరిజన సంఘం నాయకులు తామరాపల్లి సోములు, సిహెచ్ కృష్ణ వేణి, నందిపల్లి సీతమ్మ, ఎం అప్పలనరసయ్య తదితరులు కూర్చున్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి అందజేశారు.

నగరాభివృద్ధికి సహకరించండి : మేయర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న ఫ్లోర్ లీడర్ రాజేష్

నగర అభివృద్ధిలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని మేయరు వి.విజయలక్ష్మి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ సమావేశం మందిరంలో మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. మొత్తం అజెండాలో పొందుపరిచిన 40 అంశాలకు ఆమోదం లభించింది. సమావేశంలో అజెండాలోని అంశాలను ప్రస్తావిస్తూ, సమీక్షిస్తూ అవసరమైన సలహాలు సూచనలను ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంల ఓ వైపు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ మరోవైపు అభివృద్ధి, సుందరీకరణకు అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. వేసవి దృష్ట్యా బోర్ల మరమ్మతలకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, తనిఖీలను ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశించారు. నూతనంగా చేపట్టబోయే పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసామన్నారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అందరి సహకారంతో నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అభివృద్ధి సుందరీ కరణ పనుల పరిరక్షణకై అవసరమైన అధనపు సిబ్బందిని నియమించేందుకు నిర్ణయించామన్నారు. సమావేశంలో కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, కార్పొరేటర్లు పట్నాన పైడిరాజు, బోనెల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, వివిధ భాగాల అధికారులు, పాల్గొన్నారు.

జెఎన్‌టియుజివిలో సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెండు రోజులు పాటు జెఎన్‌టియులో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధ్వర్యంలో జరగనున్న జాతీయ సదస్సును యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.జయసుమ సోమవారం ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పరిశ్రమల్లో వస్తున్న మార్పులను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక పరికరాలు పని చేస్తున్న తీరును పరిశీలించడం ద్వారా మనలో సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. ఇటువంటి సదస్సులు జరగడం ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగుతుందని అధి మన చదువుకు ఎంతో దోహద పడుతుందని అన్నారు. అనంతరం మరో అతిథులు జి.సతీష్, ప్రేమ్‌కుమార్ మెకానికల్ ఇంజనీరింగ్ ప్రాధాన్యత గురుంచి వివరించారు. సదస్సులో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 1328 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 1328 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 23221 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 21983 మంది హాజరయ్యారు. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగిందని అర్ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు.

రామతీర్థం, పుణ్యగిరికి ప్రత్యేక సర్వీసులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన రామతీర్థం, పుణ్యగిరి క్షేత్రాలకు , సన్యాసయ్య పాలెం ఆలయానికి ఈనెల8 , 9వ తేదీల్లో మహాశివరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడుపుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్. అప్పలనారాయణ తెలిపారు. విజయనగరం నుండి రామతీర్థానికి 45 బస్సులు, ఎస్.కోట నుండి పుణ్యగిరికి 15 బస్సులు, ఎస్ కోట నుండి సన్యాసయ్యపాలేనికి 15 బస్సులు నడుపుతామని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండభూమిని తీసుకోవడం అన్యాయం

- నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని
- కలెక్టరేట్ ఎదుట గొర్రెలు, మేకల పెంపకందార్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు గొర్రెలు,మేకలు పెంపకం దారులు ఆధారపడే కొండ భూములు తీసుకోవడం అన్యాయమని, వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్య నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట గొర్రెలు మేకల పెంపకం దార్లతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దత్తిరాజేరు మండలం చినచామలాపల్లి సర్వే నెంబర్లు 1,2,3,100,101లో ఉన్న డి-పట్టా, సాగులో ఉన్న కొండపోరంబోకు, బంజరు, ఫారెస్టు అధికారులు మొక్కలు వేసి అప్పగించిన తోటతో కలిపి సుమారు 50 ఎకరాల భూమిని సాగుచేసుకుంటూ, జీవాలను మేపుకుంటూ గ్రామ గొర్రెలు మేకల పెంపకం దారులు బతుకుతున్నారని తెలిపారు. ఈ భూమి తప్ప వారికి ఏ ఆధారమూ లేదన్నారు. ఇటీవల ప్రభుత్వం కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు ఈ 50ఎకరాల భూమిని తీసుకుంటుందని రెవెన్యూ అధికారులు తెలిపారన్నారు. దీనివల్ల వృత్తిదారుల జీవనం దెబ్బతింటుందన్నారు. ఉన్న ఈ 50ఎకరాల భూమిని కోల్పోతే కనీసం మరుగుదొడ్ల సౌకర్యానికి కూడా నోచుకోలేరన్నారు. ఈ భూమిని కోల్పోతే మొత్తం ఊరే ఖాళీ అయిపోతుందన్నారు. గతంలో పలు దఫాలుగా ఆందోళనలు చేస్తే న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని, కానీ తాజాగా మళ్లీ హద్దులు పోల్చడానికి అధికారులు వచ్చారని తెలిపారు. ఆభూమిని కృషి విజ్ఞానకేంద్రం ఏర్పాటుకు తీసుకోకుండా వృత్తిదారుల జీవనానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వృత్తిని కాపాడడానికి సొసైటీలకు భూమిని కేటాయించాలనే ప్రభుత్వ జీవోలు కూడా ఉన్నాయన్నారు. ధర్నాలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ భర్త మజ్జి శ్రీనివాసరావు, జి.తిరుపతి, ఎం.ఎరుకు నాయుడు, ఎస్.అచన్న, బి.వెంకటరావు, టి.శంకరరావు, ఎ.తవుడమ్మ, బి.రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ ఆదేశాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఆర్‌ఒకు సమస్యను వివరిస్తున్న రవికుమార్

అయ్యప్పనగర్ లో అక్రమంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేయాలని సోమవారం స్పందనలో జిల్లా రెవెన్యూ అధికారికి అయ్యప్పనగర్ కాలనీ వాసుల కన్వీనర్ యుఎస్ రవికుమార్, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.త్రినాథ్,రెడ్డి శంకరరావు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప నగర్ లో నివాసాల మధ్య ఏర్పాటు చేసిన స్వాతీ ప్యూర్ ఫైడ్ వాటర్ ప్లాంట్‌వల్ల కాలనీ వాసులు నీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్లాంట్‌ను సీజ్ చేయాలని అనేక మార్లు విన్నవించినా మీదట సీజ్ చేయాలని ఆర్డీవో ఆదేశాలు ఇచ్చారని, అయినా ఎందుకు సీజ్ చేయడం లేదని ప్రశ్నించారు.తక్షణమే వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేసి అయ్యప్ప నగర్ వాసులకు న్యాయం చేయాలని కోరారు.

బాక్సింగ్‌లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖపట్నంలో ఈనెల 1 నుంచి 3 వరకు జరిగిన మూడవ రాష్ట్ర సబ్ జూనియర్ బాల బాలికల పోటీలలో విజయనగరం క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. బి సచిన్ బంగారు పతకం, పి.దుర్గ ప్రసాద్ , ఎన్. దేవకీ వెండి పథకాలు సాధించారు , బంగారు పతాకం సాధించిన సచిన్ ఈనెల 18 నుంచి 25 వరకు ఉత్తర ప్రదేశ్ నోయిడాలో జరగబోవు జాతీయస్థాయి పోటీలలో మన రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. పతకాలు సాధించిన క్రీడాకారులను బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మథకుమార్ సాప్ కోచ్ ఈశ్వర రావు, అసోసియేషన్ సభ్యులు రాజు, పి ఎల్ ప్రసాద్, డి, గౌరీ, బాక్సింగ్ రింగ్ అఫీషియల్స్ వి.సంతోష్ కుమార్ తదితరులు అభినందించారు.

త్వరితగతిన న్యాయం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం కోట

బాధితుల సమస్యలు వింటున్న ఎస్‌పి ఎం.దీపిక

తమ సమస్యలపై వినతులు ఇస్తున్న బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎస్‌పి ఎం.దీపిక ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదులు స్వీకరించి బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ్సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వారం 'స్పందన'కు 31 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ఎఎస్‌పి అస్మా ఫర్హీన్, ట్రాఫిక్ డిఎస్‌పి డి. విశ్వనాధ్, డిసిఆర్‌బి సిఐ కె.మురళి, సిఐ కె.కె.వి.విజయనాధ్, డిటిఆర్ బి ఎస్ఐ ప్రభావతి , ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి- డెంకాడ

సదస్సులో మాట్లాడుతున్న లోక్‌అదాలత్ చైర్మన్ దుర్గయ్య

చట్టాలపై అందరూ అవగాహన కలిగివుండాలని సమాజంలో జీవించడానికి చట్టాలు చాలా అవసరమని ప్రజాప్రయోగ సేవల శాశ్వత లోక్ అదాలత్ జిల్లా చైర్మన్ గరికిన దుర్గయ్య అన్నారు. మండలంలోని రఘుమండలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా చట్టారిత్యా నేరమని ఆడపిల్లలను అక్రమంగా ఒక చోటు నుండి మరొక ప్రాంతానికి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగించ రాదని హెచ్చరించారు. కేసుల పరిస్కారం కోసం లోక్ అదాలత్‌లను ఆశ్రయించాలని కోరారు. ఈ సదస్సులో ఆర్ఐ ఏ. అనూష, పెర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యూటిలిటీ సర్వీసెస్ ప్రతినిధి పి. శంకర్ జగన్నాథం, ఇఒపిఆర్‌డి, సర్పంచ్, ఎంపిటిసి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో మహిళలకు రక్షణ కరువు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో మహిళలకు రక్షణ కరువైందని నియోజకవర్గ టిడిపి , జనసేన ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం 44వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు, యువతకు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు రావాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. మహిళలను అన్ని రంగాలలో పైకి తీసుకువచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదే అన్నారు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, డ్వాక్రా సంఘాల ఏర్పాటు ద్వారా ఆర్థిక పురోగతి, దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు, రాజకీయాలలో మహిళలకు రిజర్వేషన్లు వంటి అనేక పథకాలను రూపొందించి మహిళాభ్యుదయానికి కృషి చేసారన్నారు. కానీ వైసిపి పాలనలో నేడు మహిళలకు కనీసం రక్షణ కరువైందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, టిడిపి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అయ్యన్నపేటలో సోమవారం జయహో బిసి కార్యక్రమం జరిగింది. స్థానిక వార్డులకు చెందిన బిసిలు, టిడిపి,జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

జగనన్న కు చెబుదాంకు 210 వినతులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న చిన్నారి

జగనన్నకు చెబుదాంలో వివిధ సమస్యలపై ప్రభుత్వ శాఖలకు ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆయా ప్రభుత్వ శాఖలు తమకు సంబంధించి ఆన్‌లైన్‌లో పంపిన వినతులను పరిశీలించి వాటిపై స్పందించాలన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణలో సంయుక్త కలెక్టర్ కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ సుమబాల, మురళీ కృష్ణ, ఆర్‌డిఒ సూర్యకళతో కలసి జిల్లా కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 210 వినతులు అందాయి.

దశల వారీ వసూలు చేయాలి

నగరంలోని దుకాణదారుల వద్ద ట్రేడ్ లైసెన్స్ రుసుముకు సంబంధించి చాలా ఏళ్లుగా బాకీ పడిన మొత్తాన్ని ఒకేసారి అపరాధ రుసుంతో కలిపి చెల్లించాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని, వారికి వాయిదాలుగా చెల్లించేందుకు వెసులుబాటు కల్పించాలని కలెక్టర్‌కు టిడిపి నాయకులు వినతినిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఐవిపి రాజు, రాజేష్‌బాబు, బొద్దలనర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కనకల మురళీమోహన్, బంగారుబాబు పాల్గొన్నారు.

7న రసాయనిక విపత్తులపై మాక్ డ్రిల్

విపత్తుల నిర్వహణ శాఖ సూచనల మేరకు ఈనెల 7న రసాయనిక విపత్తుల (కెమికల్ డిజాస్టర్) పై మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. పూసపాటిరేగ మండలం చోడవర నున్న మైలాన్ లాబ్స్ వద్ద 7వ తేదీన ఉదయం 9 గంటల నుండి ఈ మాక్ డ్రిల్ నిర్వహిస్తారని తెలిపారు. స్పందన అనంతరం కలెక్టరేట్ లో అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ మాక్ డ్రిల్ కార్యక్రమానికి సంబంధించి టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్ ఈనెల 5న జరుగుతుందని, ఆన్‌లైన్ లింక్ ద్వారా సంబంధిత అధికారులు హాజరై వారి బాధ్యతలను, విధులను తెలుసుకోవాలని తెలిపారు. 7న అధికారులంతా మైలాన్ లాబ్‌కు హాజరు కావాలని తెలిపారు.

హెల్త్ అలవెన్స్ బకాయిలు తక్షణమే చెల్లించాలి

విజయనగరం టౌన్ : మున్సిపల్ కార్మికులకు జీతాలు, హెల్త్ అలవెన్సె బకాయిలు వెంటనే ఇప్పించాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు, నాయకులు బి .భాస్కరరావు మాట్లాడుతూ నెలల తరబడి జీతాలు, హెల్త్ అలవెన్స్ లు చెల్లించకపోతే కార్మికులు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఆప్కాస్ యేతర కార్మికులైన లీకులు, వాల్ ఆపరేటర్లు, ప్లాంటేషన్ కార్మికులు, ఆఫీస్ సబార్డినేటర్స్, కంప్యూటర్ ఆపరేటర్లకు 3నెలల వేతనాలు బకాయిలు ఉన్నాయని, వీటన్నింటిని వెంటనే ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. సమస్యలపై మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద చేయనున్నట్లు తెలిపారు.వినతిపత్రం ఇచ్చిన వారిలో గౌరీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు

6 వేలు పింఛను ఇవ్వాలి

వికలాంగులకు రూ.6వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.తవిటి నాయుడు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ వికలాంగులకు, వృద్ధులు, వితంతువులకు ఇతర సామాజిక పెన్షన్‌ను రూ.6వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో వికలాంగులకు సంక్షేమ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఎస్.రహీమ్,బివి శ్రీనివాసరావు, ఎం.సత్తిబాబు తదితులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆశాఖ విజిలెన్స్ విజయనగరం సిఐ కె.కృష్ణ సోమవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఇటీవల విద్యుత్ నిఘా శాఖ అధికారులు విజయనగరం,పార్వతీపురం మన్యం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై కేసులు, విద్యుత్ అక్రమ వినియోగదారులపై భారీగా అపరాధ రుసుం వసూలు చేశారని తెలిపారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లయితే విజయనగరం సర్కిల్ ల్యాండ్ లైన్ నెంబర్ 08922-234579కు ఫోన్ చేసి, సమాచారం అందించాలని కోరారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - రామభద్రపురం

ఈ నెల 18 నుంచి 30 వరకు జరగబోయే పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని ఎంఇఒ తిరుమలప్రసాద్ తెలిపారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకూ జరుగుతాయన్నారు. మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 469 మంది పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. పరీక్ష కేంద్రాల్లో పూర్తి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉత్తమ ర్యాంకులు సాధించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. నూకరాజు సూచించారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎన్నికల సెక్టార్ అధికార్లు, పోలీసులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, వైద్య పరమైన కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా పోలింగ్ రోజున ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. ఈవిఎం సక్రమంగా పని చేస్తుందా లేదా అని ముందుగా తనిఖీ చేసి నిర్ధారణ జరిగిన తరువాత ఓటింగ్‌కి అనుమతించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి. ధర్మరాజు, ఎలక్షన్ డిటి ఎన్‌వివిఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇంటర్వ్యూ చేస్తున్న కమిషనర్ ప్రసాద్

నగర పంచాయతీలో ఖాళీ వార్డు వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ నగర పంచాయతీ వార్డు వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలో ఏర్పడిన 8 పోస్టుల భర్తీ గత నెల 21న నోటిఫికేషన్ జారీ చేసి ఆన్‌లైన్ ద్వారా 7 గురు నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ నేపథ్యంలో వారికి ఇంటర్వ్యూ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ టివియస్ విశ్వేశ్వర రావు, సీనియర్ సహాయకులు వైఎస్ఎసిహెచ్ పావయ్య రాజు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

జాతరను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - బొండపల్లి

మహాశివరాత్రి పర్వదినాన కొత్తపాలెంలో జరగనున్న కృష్ణమ్మ పేరంటాలు జాతర మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బొండపల్లి మాజీ వైస్ ఎంపిపి బొద్దు రాము కోరారు. ఈ సందర్భంగా సోమవారం కొత్తపాలెంలో జాతరకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. అనంతరం బొద్దు రాము మాట్లాడుతూ యువతలో ఉత్సాహాన్ని నింపేందుకు జిల్లా స్థాయిలో వాలీబాల్, కబడ్డీ పోటీలను, గుర్రపు స్వారీ, ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బొద్దు రాము కోరారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తెర్లాం

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మండలంలోని పెరుమాళి ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 2న జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎంటర్‌ప్రే న్యూర్ మైండ్ సెట్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో మొత్తం 256 ప్రాజెక్టులు ప్రదర్శనలో పెరుమాళి మోడల్ స్కూల్ టాప్ 4 గా నిలిచింది. అగ్రి రోబోట్ ప్రాజెక్ట్ నేటి సమాజంలో వ్యవసాయ రంగంలో ఎంతగానో ఉపయోగపడుతుందని, వివిధ రకాల పనులను అతి తక్కువ సమయంలో వేగంగా పని చేయడంలో ఈ అగ్రి రోబోట్ ప్రముఖ పాత్ర వహిస్తుందని గైడ్ టీచర్ బి. లక్ష్మణ్ చెప్పారు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు జి.దేవి ప్రసాద్, వి.కార్తిక్ ఈ ప్రాజెక్టును తయారు చేసి సత్తా చాటారన్నారు. ఈ ప్రాజెక్టు విజయం సాధించడంలో ప్రిన్సిపాల్ ఎంతో కృషి చేశారని గైడ్ టీచర్ తెలిపారు. ఈ ప్రాజెక్టును తయారు చేసిన విద్యార్థులను, గైడ్ టీచర్‌ను ప్రిన్సిపాల్ జి.జ్యోతిలక్ష్మి సోమవారం అభినందించారు.

ప్రవేశాలకు దరఖాస్తులు

మండలంలోని పెరుమాళి ఎపి మోడల్ స్కూల్‌లోని ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదవ తరగతి చదువుతున్న ఆరవ తరగతిలో ప్రవేశించేందుకు ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వంద మార్కులకు ప్రశ్నా పత్రం ఉంటుందని మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు.

కార్పొరేషన్ అభివృద్ధికి కృషి

భోగాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గా నూతనంగా నియమితులైన వెంకటరామణ రెడ్డిని సోమవారం ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

రేపు వారపు సంత ప్రారంభం

బొబ్బిలి : స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం వారపుసంత ప్రారంభించనున్నట్లు ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలిలో నిర్వహించే వారపుసంత కోవిడ్ కారణంగా రద్దు అయిందని, పాడి రైతులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మార్కెట్ యార్డులో ప్రతి బుధవారం సంత నిర్వహిస్తామని చెప్పారు. సంతను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని పాస్టర్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం తాడివానిపాలెం కల్వరి జ్వాల మందిరంలో పాస్టర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగింది. ఈ ఎన్నికలో ప్రెసిడెంట్‌గా రెవ.ఎం. జాన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా రెవ.జి.అనిల్ కుమార్ ఎన్నికయ్యారు. సెక్రటరీగా రెవ.ఎన్ చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీగా రెవ.బి. జాషువా, ట్రెజరర్‌గా రెవ బి.రమేష్, జాయింట్ ట్రెజరర్‌గా పాస్టర్ ఎస్.సాల్మన్ రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మెంబర్స్ పాస్టర్.ఏ.జె. సాముయేలు, పాస్టర్ ప్రభు దాస్, పాస్టర్ వి. ప్రకాష్, ఆడ్వైజర్‌గా రెవ.ఎం. చందునాయుడు, రెవ.వి.పరమానందం ఎన్నికయ్యారు. మండలంలో ఉన్న పాస్టర్లందరూ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

సొంతింటి కల సాకారమే లక్ష్యం

ప్రజాశక్తి- బొబ్బిలి

పేదోడి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో సోమవారం పట్టణ పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వస్తే సొంతిల్లు లేని పేదలకు సొంతింటి కలను సాకారం చేస్తామని పాదయాత్ర, ఎన్నికల్లో ప్రజలకు సీఎం జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చినట్లే అర్హులందరికీ ఇంటి స్థలం ఇచ్చి జగనన్న ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. పేదల ఇంటికి నిర్మాణ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఎన్నికల హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో 1741 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళి, జి.రమాదేవి, కమిషనర్ ఎల్.రామలక్ష్మి, జెసిఎస్ కన్వీనర్ రేజేటి విస్సు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

భోగాపురం: పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

బాడంగి: అర్హత ఉన్న ప్రతి పేదవాడికీ సొంతింటి నిర్మాణ కల్పనే తమ ప్రభుత్వ లక్ష్యమని ఇంటి నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును ప్రభుత్వం చెల్లిస్తుందని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. సోమవారం పేదలకు ఇళ్లపట్టాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇల్లు పట్టాలు పంపిణీ చేశారు. మండలం పరిధిలో 398 మందికి పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజారావు, ఎంపిడిఒ ఆంజినేయులు, జెడ్‌పిటిసి రామారావు, ఎంపిపి బోగి గౌరి, నాయకులు తెంటు మధుసూదన్, వైస్ ఎంపిపి రమేష్ తుదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: ఇల్లు లేని ప్రతి పేదోడికి ఇల్లు ఉండాలనేది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇళ్ల పట్టాలను ఆయన సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లు స్థలం మంజూరు చేసి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడమనేది ఇంతవరకు ఏ ప్రభుత్వమూ చేయలేదన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం పక్కన ఎంతో విలువైన స్థలాలను పేదలకు అందించామన్నారు. పవన్ కళ్యాణ్ ఎన్ని జాకీలు పెట్టి లేపిన టిడిపి అధికారంలోకి రావడం కష్టమని అన్నారు. ఇక్కడ జనసేన అభ్యర్థి బకెట్లు పంపిణీ చేస్తున్నారని అవి తీసుకుని వైసిపికే మళ్లీ ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు పడాల శ్రీనివాసరావు, భాను, తహశీల్దార్ పి.శ్యాంప్రసాద్, ఎంపిడిఒ చంద్రకళ, నాయకులు బైరెడ్డి యర్రప్పలనారాయణ, సుందర హరీష్, కర్రోతు వెంకటరమణ, పతివాడ రామకృష్ణ, పైడి నాయుడు, వాసుపల్లి రెయ్యుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

వాలంటీర్లదే బాధ్యత

ప్రజాశక్తి - బాడంగి

ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత వాలంటీర్లదేనని ఎమ్మెల్యే శంబంగి చిన్న అప్పలనాయుడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా జెసిఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్ అధ్యక్షతన వాలీంటర్లు, గృహసారథులు, బూత్ కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం చూడకుండా పార్టీలకు అతీతంగా అందరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. పార్టీ కోసం అందరూ కలిసి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే అభివృద్ధి : కోండ్రు

ప్రజాశక్తి- రేగిడి

టిడిపి అధినేత నారా చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని టిడిపి హయాంలోనే అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ అన్నారు. టిడిపి హయామంలో గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు, విద్య, వైద్యం, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. రాజాం మండలంలోని శ్యాంపురం టిడిపి క్యాంపు కార్యాలయంలో రేగిడి మండలం అంబాడ వెంకటాపురం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు, నాయరాలవలస పంచాయితీ రెడ్డి పేట గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసిపిని వీడి సోమవారం ఆయన సమక్షంలో టిడిపిలో చేరాయి. వీరిందరికీ ఆయన పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రూపకల్పన చేసిన మినీ మానిఫెస్టోలో ఉన్న సూపర్ సిక్స్ పథకాల పై రాష్ట్ర ప్రజలు ఎంతో సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కిమిడి అశోక్ కుమార్, ధర్మారావు, దుప్పల పూడి శ్రీను, వావిలపల్లి క్రాంతి కుమార్, ఎరుకునాయుడు, కర్రీ శశిభూషణ్ రావు, కర్నెన విశ్వేశ్వరరావు, రెడ్డి రామారావు, పాలవలస బాలయ్య, కొవ్వాడ మురళీ, తవుడు తదితరులు పాల్గొన్నారు.

అందర్నీ కలుపుకొని ముందుకు సాగుతా

గంట్యాడ: రానున్న ఎన్నికలలో నియోజకవర్గం పరిధిలో టిడిపి శ్రేణులను కలుపుకొని ముందుకు కొనసాగుతానని గజపతినగరం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం కొట్టారుబిల్లి కూడలిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తున్నానని మొదటిసారిగా జగ్గాపురంలో పర్యటనను ప్రారంభించానని చెపాప్రు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కుటుంబ సభ్యులుగా పనిచేసి తమను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. యువతను కలుపుకొని ముందుకు సాగుతామన్నారు. ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గం పరిధిలో మొట్ట మొదటి సారిగా వ్యవసాయం అభివృద్ధిపై దృష్టి పెట్టి రైతులు యోగక్షేమాలకు కృషి చేస్తానని అన్నారు. చిన్నచిన్న కంపెనీలను నిర్మించడానికి తమ వంతు ప్రయత్నం చేస్తానన్నారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ పునర్మాణానికి కృషి చేస్తానని, ప్రతి గ్రామంలోని రోడ్లు, కాలువల నిర్మాణాలను చేపడతానన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్‌పిటిసి కొరుపోలు రమేష్ కుమార్, మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, వసాది మాజీ ఎంపిటిసి కే. జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

బొండపల్లి: నియోజకవర్గం అసెంబ్లీ టికెట్ విషయంలో టిడిపి అధిష్టానం మంచి ఆలోచన చేస్తుందని టిడిపి కార్యకర్తలు అధైర్యపడొద్దని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కరణం శివ రామకృష్ణ అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాలు నుంచి వచ్చిన పలువురు సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సారి తప్పకుండా తనకు ఎమ్మెల్యే టికెట్ వస్తుందని నియోజకవర్గంలోని టిడిపి కార్యకర్తలు, నాయకులు ముఖ్యంగా ప్రజలతో పాటు తాను కూడా ఆశించానన్నారు. అయితే ఆ ఆశలను వమ్ము చేసేవిధంగా కొంతమంది వ్యక్తులు టిడిపి అధిష్టానానికి తప్పుడు నివేదికలు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్ ప్రకటించిన అనంతరం నియోజకవర్గంలో వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు అదిష్టానం తెలుసుకుంటుందని ఈ నేపథ్యంలో కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ రుంకాణ అరుణ, మాజీ సర్పంచ్‌లు లెంక చిన్నం నాయుడు, సూర్యనారాయణ, మాజీ ఎంపిటిసిలు కరుమజ్జి కృష్ణ, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


రేగిడి: మాట్లాడుతున్న మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్

చంద్రబాబును సిఎంను చేయడమే లక్ష్యం

చీపురుపల్లి: వచ్చే సాధారణ ఎన్నికలలో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం అని నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. సోమవారం తన నివాశంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికలలో టిడిపి -జనసేన కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. బాబు సూపర్ సిక్స్ పథకాలు వల్ల పేద ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ సూపర్ సిక్స్ పథకాల గురుంచి టిడిపి కేడర్‌తో అటు గ్రామ స్థాయి నాయకులు ప్రజలకు వివరించనున్నారని చెప్పారు.

భూ కబ్జాలపై స్పందనలో ఫిర్యాదు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపరితి గ్రామ సచివాలయం పరిధిలో గల చినదుంగాడ గ్రామానికి చెందిన కొప్పల కిత్తన్నదొర సోమవారం జగనన్నకు చెబుదాం స్పందన విభాగంలో తమ భూమి కబ్జాలపై ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 6లో సుమారు1.1/2 జిరాయితీ భూము మెట్టు తమకు ఉందని అందులో జీడి తోట, టేకు మొక్కలు వేసుకున్నానని చెప్పారు. ఈ భూములు తమకు వంశపారం పర్యంగా సంక్రమించాయని గుర్తు చేశారు. సర్వే నెంబరు. 3/1లో 0.41 సెంట్లు జిరాయితీ, మెట్టు, సర్వే నెంబరు 5/14లో 44 సెంట్లకు సంబంధించిన భూమిని విశాఖపట్నం జిల్లా కృష్ణాపురం గ్రామానికి చెందిన పురుషోత్తమ, గోపాలపట్నంకు చెందిన సత్య అప్పారావు, పెందుర్తి మండలం చిన్నముసివాడి గ్రామానికి చెందిన వెంకటరామరాజులు రౌడీలను తీసుకువచ్చి తమ పేరును ఉన్న జిరాయితీ భూములను వారి పేరున రికార్డులో మార్పు చేయించుకుని తమను మానసికంగా ఇబ్బందులు పెడుతూ, తప్పుడు కేసులు నమోదు చేయించి కోర్టులు చుట్టూ తిప్పుతు న్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. క్షేత్రస్థాయిలో పరిశీలించి వంశపారంపర్యంగా తమకు ఉన్న భూములను రికార్డు పరంగా తమకే దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తహశీల్దార్ బి.సత్యంకు వినతి పత్రాన్ని అందించారు. స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ ఆర్ఐ రామలక్ష్మిని పంపించి పరిశీలన చేయిస్తామన్నారు.

జిల్లా కలెక్టర్ స్పందన విభాగంలో ఫిర్యాదు

మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన ఎస్‌సి కులస్తులు మూనూరు రమణ, జామి చంద్రావులు తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దృష్టికి, మండల రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ తమకు ఇళ్ల స్థలాలు కేటాయించలేదని చెప్పారు. ఎటువంటి అర్హత లేకపోయినప్పటికీ 16 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని తమకు ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వేపాడ: ఫిర్యాదు పత్రాన్ని చూపిస్తున్న బాధితులు

అంగన్వాడి కార్యకర్తపై స్పందనలో ఫిర్యాదు

రేగిడి: మండలంలోని గుల్లపాడు పంచాయతీ పరిధి వండాన పేట గ్రామంలో అంగన్వాడీ కార్యకర్త ముగడ జయలక్ష్మి చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం ఇవ్వడ ంలో జాప్యం చేస్తున్నారని ముంజేటి కోమలి, చల్ల చైతన్య ఎంపి డిఒ శ్యామల కుమారికి సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహారం ఇవ్వకుండా సొంతానికి వాడుకొని, మిగిలిన సరుకులు అమ్ముకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంగన్వాడీలో నమోదైన రికార్డులు ప్రాప్తికి విచారణ చేపడితే అసలు విషయం బయటపడు తుందని ఎంపిడిఒకు కోరారు. ఎంపిడిఒ స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కుటుంబానికి రూ.5వేలు

ప్రజాశక్తి - భోగాపురం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి పేద ఇంటికి నెలకు రూ.5వేలు చొప్పున ఇస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ అన్నారు. మండలంలోని గుడివాడ గ్రామంలో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ కార్యక్ర మంలో భాగంగా సోమవారం పర్యటించారు. బిజెపితో దేశంలో అభివృద్ధి అనేది కుంటుపడిం దన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువస్తే రాష్ట్రంతో పాటు దేశం కూడా అభివృద్ధి చెందుతుం దన్నారు. కార్యక్రమం లో నాయకులు రమణారెడ్డి, నాయకులు సూర్యనారాయణ, రాజు, శ్రీను, రవి, అప్పారావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న రమేష్

గ్రీన్ అంబాసిడర్లకు బకాయి వేతనాలివ్వాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

గ్రీన్ అంబాసిడర్లకు బకాయి వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు ఎ.సురేష్ డిమాండ్ చేశారు. బాడంగి మండలంలోని గ్రీన్ అంబాసిడర్లకు పూర్తి స్థాయిలో బకాయి వేతనాలు చెల్లించాలని కోరితూ సోమవారం ఆర్‌డిఒ సాయిశ్రీకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు 14 నెలలు నుంచి 20 నెలలు వరకు వేతనాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ పంచాయతీ కార్యదర్శులు సగం నెలలకు మాత్రమే వేతనాలు బకాయి ఉందని బిల్లులు పెట్టారన్నారు. పూర్తి స్థాయిలో వేతనాలకు బిల్లులు పెట్టకుండా గ్రీన్ అంబాసిడర్లకు వేతనాల బిల్లు పెట్టకపోవడం దుర్మార్గమన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేసి ప్రజల ప్రాణాలను కాపాడుతున్న గ్రీన్ అంబాసిడర్లకు అన్యాయం చేయడం సబబు కాదన్నారు. పూర్తి స్థాయిలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒను కోరగా దర్యాప్తు చేసి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు సమస్యను వివరిస్తున్న నాయకులు

వైసిపితోనే అభివృద్ధి

ప్రజాశక్తి - జామి

వైసిపితోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అలమండ సచివాలయ భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నాలుగున్నర సంవత్సరాలలో పేద ప్రజలు సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా పాలన అందిచామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జగనన్న నవరత్నాలు అమలు చేసామని, నవరత్నాలు ద్వార ఇంటి స్థలాలు, వైఎస్ఆర్ ఆసరా, చేయూత, రైతు భరోసా, బీసీ నేస్తం, వంటి పథకాలు అందించామని గుర్తు చేశారు. గ్రామాల్లో సుస్థిరపాలన అందించేందుకు సచివాలయా లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాలంటీర్ వ్యవస్థ ద్వార అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు గొర్లె రవి కుమార్, జెడ్‌పిటిసి గొర్లె సరయు, ఎంపిపి సబ్బవరపు అరుణ, అలమండ సూరిబాబు రాజు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, అలమండ లగుడు దేముడు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జాగరంలో ఆర్‌బికె ప్రారంభం

అనంతరం జాగరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జాగరం సర్పంచ్ వసి పార్వతి, ఎంపిటిసి నరసింహనాయుడు, పావాడ నాయుడు, గోపాల కృష్ణ మాస్టారు, కొత్తలి కన్నంనాయుడు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావ సభ జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల సంఘీబావ సభను జయప్రదం చేయాలని మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూని యన్ అధ్యక్షులు టి. వి. రమణ పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక ఆర్‌ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మి కులు న్యాయమైన సమస్యలు పరిష్కరి ంచాలని కోరుతూ చేస్తున్న నిరసన శిబిరం 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా టి.వి రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ నిరశన శిబిరంలో మాట్లాడుతూ నెలలు గడుస్తున్న మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించక పోవడంతో ఉద్యోగులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజల సహకారంతో మంగళ వారం సంఘీబావ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు మిమ్స్ ఉద్యోగులు, కార్మి కులు చేస్తున్న న్యాయ పోరాటానికి మద్దతు పలికి సంఘీబావ సభను జయ ప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు ఎం.నారాయణ, కె.కామునాయుడు, ఎం. నాగభూషణం, కొమ్మూరి మధు, రాంబాబు, అప్పలనాయుడు, గౌరి, బంగారు నాయుడు, మూర్తి పాల్గొన్నారు

మాట్లాడుతున్న టివి రమణ

ముగిసిన హ్యాక్‌ట్రియాడ్

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ప్లేస్‌మెంట్ సెల్ ఇటీవల నిర్వహించిన డైనమిక్ 72-గంటల హ్యాక్ ట్రియాడ్ ఈవెంట్ సోమవారం ముగిసింది. మొత్తం రూ.2.5 లక్షల ప్రైజ్ పూల్‌తో, పోటీలో పాల్గొని కోడింగ్ సవాళ్లలో నిమగ్నమై విషయ నైపుణ్యతను పెంపొందించు కున్నారు. హైదరాబాద్‌కు చెందిన పర్పుల్ టాక్ హెచ్ఆర్ మేనేజర్ గైకా రామారావు మాట్లాడుతూ వ్యక్తిత్వాన్ని ఎలా నిర్మించుకోవాలి, సహకార అభ్యాసన, సాధనాల వినియోగం గురించి వివరించారు. సిసిసి వ్యవస్థాపక సిఇఒ నాగవీర్ వివిధ రకాల హ్యాకథాన్‌లు, హ్యాకథాన్‌లలో ప్రాముఖ్యత, జట్టు ఏర్పాటు చిట్కాలు, హ్యాకథాన్స్ సమయంలో సమయ నిర్వహణ, నెట్‌వర్కింగ్ గురించి మాట్లాడారు. శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ శ్రీనివాస శర్మ మాట్లాడుతూ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల గురించి వివరించారు. గేట్ స్కోర్ ద్వారా ఐఐటిలు, ఎన్ఐటిలలో అడ్మిషన్లు తీసుకోవడానికి ఔత్సాహికులకు సహాయపడే ప్రోగ్రామ్ వెబ్ పేజీని సిద్ధం చేయడంలో గ్రాడ్ మైండ్స్ టీమ్ అద్భుతమైన ప్రదర్శన చేసి హ్యాకథాన్లో విజేతగా నిలిచింది. విజేతలకు సామ్‌సంగ్ ట్యాబ్‌లు, రూ.10వేలు నగదు బహుమతిని అందించారు.

అధికారుల నిర్లక్ష్యమే మృతికి కారణం

ప్రజాశక్తి- రేగిడి

రాజాం మున్సిపాలిటీ బొబ్బిలి సెంటర్‌లో ఆదివారం రాత్రి మర్రిచెట్టు కూలి కొండంపేటకు చెందిన ముద్దన శ్రీనివాసరావు మృతి చెందారని ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యమే కారణమని సిఐటియు నాయకులు సిహెచ్ రామమూర్తి నాయుడు అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం వద్ద గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు పక్కన కాలం చెల్లిని చెట్లను అధికారులు ఉంచడంతో ఆ చెట్టు నేలకు ఒరిగి శ్రీనివాసరావు మృతి చెందడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఆ కుటుంబాన్ని వెంటనే ఆదుకోవాలని కోరారు. ఆ కుటుంబానికి రూ. 25లక్షలు నష్టపరిహారం ఇవ్వడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే సిఎం రిలీఫ్ ఫండ్ వచ్చేలా కృషి చేస్తామని సిఐ డి.మోహన్‌రావు, తహశీల్దార్ హామీ ఇచ్చారు.

నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు

రోడ్డున పడ్డ శ్రీనివాసరావు కుటుంబం

సంకిలి షుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న శ్రీనివాసరావు ప్రమాదవశాత్తు మర్రి చెట్టు కూలి మృతి చెందడ ంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఇద్దరు పిల్లలతో ఎలా బతికేదని భార్య రోదన చూపరులను కంటతడి పెటించింది.

వేతనాలు పెంచాలని రిలే దీక్ష

ప్రజాశక్తి- గజపతినగరం

పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరుతూ గజపతినగరం, పురిటిపెంట గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు సోమవారం స్థానిక మెయిన్‌రోడ్డులో రిలేనిరాహారదీక్షలు చేపట్టారు. జీతాలు పెంచాలని కోరుతూ నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు ...అధికారులు, ఆయా సర్పంచ్‌లు స్పందించకపోవడంతో నిరాహారదీక్షలు చేపట్టారు. దీక్షలను సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, బి .గోవిందా, ఎస్ కృష్ణ ప్రారంభించారు. రోజుకు రూ.300 కూలితో బతకడం సాధ్యం కాదని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలుపెంచాలని, పిఎఫ్, ఇఎస్ఐ, హెల్త్ అలవెన్స్ సౌకర్యం కల్పించాలని, దహన సంస్కరణ ఖర్చు కింద 15 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కనకరాజు, నాగేశ్వరరావు, కృష్ణ, కోటి, ఏసు తదితరులు పాల్గొన్నారు. దీక్షలకు డివైఎఫ్ఐ నాయకులు నాయుడు మద్దతు తెలిపారు.

నినాదాలు చేస్తున్న పంచాయతీ కార్మికులు

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఫస్ట్‌ఫ్లోర్, పి.వి.ఎస్. ప్రైమ్, ఎ.జి. రోడ్, 3 లాంతర్ సెంటర్, విజయనగరం.ఫోన్ :80746 56196

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-03-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 184.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 80088 12798